క్లుప్తంగా

వాహనాల తనిఖీ

హుజూరాబాద్: వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ శివారులోని పపకాల క్రాస్ రోడ్డు వద్ద సీఐ తిరుమల్‌గౌడ్ వాహనాల తనిఖీ నిర్వహించారు.

యాంటీబయోటిక్స్ వాడకం తగ్గించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: యాంటీబయోటిక్స్ వాడకాన్ని ప్రజలు క్రమక్రమంగా తగ్గించాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం వరల్డ్ ఏఎమ్మార్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో చాలామంది చిన్నచిన్న రోగాలకు యాంటీబయోటిక్స్ వాడుతూ రోగనిరోధక శక్తిని పూర్తిస్థాయిలో కోల్పోతుందన్నారు. నిత్యం యాంటీబయోటిక్స్ వాడకంతో రోగనిరోధక శక్తి పూర్తిగా కోల్పోవడంతో పాటు భవిష్యత్తులో ఏదైనా రోగ నిరోధక శక్తిని నిరోధిస్తూ వచ్చే బ్యాక్టీరియాను అడ్డుకోవడం కష్టమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యాంటీబయోటిక్స్ వాడకం తగ్గిస్తూ వ్యక్తి స్వయంగా శరీరంలో ఇమ్యూనిటీ ఏర్పాటు చేసుకునేలా ఆహార అలవాటులతో పాటు వ్యాయామం చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్ రావు,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ రెజీనా, ఆయేషా బేగం, జ్యోతి, కనకలక్ష్మి,ఉమాదేవి,శోభ,రమ్యకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం బీచ్ వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. అండర్ -14, 17 బాలబాలికల విభాగంలో వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు డీఈవో జనార్దన్‌రావు బహుమతులు అందించారు. అనంతరం డీఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, హ్యాండ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అనూప్‌రెడ్డి, హెచ్ఎం సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగుల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఏరియాలో మూత్రవిసర్జనశాల నిర్మించాలని గ్రామస్తులు కార్యదర్శి శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వంగ రామకృష్ణ, రేణుకుంట్ల సారయ్య, భోగం సాయిరాం, శ్యామ్, సతీష్, రాజు తదితరుల పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మంగళవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ కృష్ణ, ఏవో జ్యోతిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన కారు

హుజూరాబాద్: పట్టణ శివారులోని డిపో క్రాస్ వద్ద మంగళవారం రాత్రి బస్సును వెనుక నుంచి ఓ కారు ఢీకొట్టింది. ఘటనలో కారు ముందుభాగం ధ్వంసమైంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.





- నేషనల్ హైవే నుంచి ఈదులగట్టెపల్లికి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయని వైనం
- ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులతో విషయం వెలుగులోకి
- ఇటీవల రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ఆ ఊరికి దారేది..!

మానకొండూర్: నేషనల్ హైవే పక్కనే గ్రామం. ఆ ఊరికి తారురోడ్డు ఉంది. ఇటీవల రోడ్డు మరమ్మతులకు సుమారు రూ.ఐదుకోట్లు మంజూరయ్యాయి. అరవై ఏళ్ల క్రితం నుంచే గ్రామానికి బస్సు సర్వీసు ఉంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు జమ్మికుంట -కరీంనగర్, ఊటూరు- కరీంనగర్‌కు వెళ్తుంటాయి. అలాంటి గ్రామానికి అసలు రోడ్డే లేదని అధికారులు ఆ గ్రామానికి సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం విశేషం. కొత్తగా నిర్మిస్తున్న నేషనల్ హైవే నుంచి గ్రామానికి వెళ్లేందుకు వీలుగా ఎడమ వైపు సర్వీస్ రోడ్డు చేపట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సర్వీస్ రోడ్డు లేకపోతే గ్రామానికి ఎలా వెళ్లేదని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద నేషనల్ హైవే పనుల్లో భాగంగా భూ సేకరణ చేసి అక్కడ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. బ్రిడ్జి వరకూ నేషనల్ హైవే పనులు చేశారు. దీంతో గ్రామానికి వచ్చేందుకు వీలుగా సర్వీస్ రోడ్డు లేదని గ్రామస్తులు గుర్తించి ఆందోళనకు దిగారు. నేషనల్ హైవే నుంచి గ్రామానికి వచ్చేందుకు వీలుగా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే నేషనల్ హైవే ఉన్నతాధికారులు, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు విన్నవించారు. ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద నేషనల్ హైవే కోసం అధికారులు భూ సేకరణ చేశారు. ఈ స్టేజీ వద్ద ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ఉంది. దీనిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జిపై నుంచి వెళ్లేందుకు వీలుగా రహదారి నిర్మాణ పనులు చేపడుతుండటంతో గ్రామానికి సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని వెలుగులోకి వచ్చింది.

యూటర్న్ వద్ద దారి దాటేదెలా...

గ్రామానికి సర్వీస్ రోడ్డు అవసరం అనే విధంగా అధికారులు నక్ష రూపొందించలేదు. గతంలో ఇదే స్టేజీ వద్ద కరీంనగర్, వరంగల్ వైపు బస్టాప్‌లు ఏర్పాటు చేశారు. ఈదులగట్టెపల్లి నుంచి వచ్చే వాహనాలు కరీంనగర్‌కు వెళ్లేలా కుడివైపు ఓ సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి ప్రధాన రహదారిలో కలిసి వెళ్లేలా నక్ష రూపొందించినా రహదారికి అవతలి వైపు ఉన్న రైతులు, కరీంనగర్ వైపు నుంచి ఈదులగట్టెపల్లికి వెళ్లే వాహనదారుల కోసం సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయడం లేదు. ఒకేదారి గుండా గ్రామానికి వెళ్లేలా నక్ష రూపొందించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోలు బంకు తర్వాత యూటర్న్ తీసుకుని గ్రామానికి రావాల్సి ఉంటుందని, డిజైన్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని నేషనల్ హైవే పనుల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు చెబుతున్నారు. స్టేజీ వద్ద కుడివైపు మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపడతామని, ఎడమవైపు చేపట్టేందుకు ఎలాంటి నక్ష రూపొందించలేదన్నారు. కరీంనగర్ నుంచి ఈదులగట్టెపల్లి రావాలంటే పెట్రోలు తర్వాత యూటర్న్ వద్ద కుడి వైపు మళ్లీ వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వెళ్లే రహదారిని దాటుతూ ఈదులగట్టెపల్లికి కుడి వైపు ఏర్పాటు చేస్తున్న రోడ్డు నుంచే గ్రామానికి రావాల్సి ఉంది. ఇలాగైతే పెద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటాయని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో ఉన్న స్టేజీ వద్ద కాకుండా ఎంత దూరంలో వరంగల్, కరీంనగర్ వైపు వెళ్లేలా బస్టాప్ నిర్మాణం చేపడుతారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. స్టేజీ వద్ద చేపట్టిన నేషనల్ హైవే పనులను గ్రామస్తులు ఇటీవల అడ్డుకున్నారు. కరీంనగర్ వైపు నుంచి ఈదులగట్టెపల్లికి నేరుగా సర్వీస్ రోడ్డు చేపట్టాలని, స్టేజీ వద్ద కరీంనగర్, వరంగల్‌కు వెళ్లేలా బస్టాప్‌లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద నిలిచిన పనులు

ప్రమాదాలు జరుగుతాయి



గ్రామ స్టేజీ వద్ద ఎప్పటిలాగే రెండు వైపులా బస్టాప్‌లు నిర్మిస్తారని అనుకున్నాం. నేషనల్ హైవే పనులు చేపట్టే దాక గ్రామానికి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం లేదని తెలియదు. పెట్రోలు బంకు సమీపంలో యూటర్న్ తీసుకుని రోడ్డును దాటుతూ కుడివైపు రోడ్డు నుంచి గ్రామానికి రావాలంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉంది. కరీంనగర్ నుంచి గ్రామానికి వచ్చేలా ఎడమ వైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– పెండ్యాల నారాయణరెడ్డి, ఈదులగట్టెపల్లి

రోడ్డు పనులు జరగనివ్వం



నేషనల్ హైవే నుంచి గ్రామానికి వచ్చేలా ఎడమ వైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం దారుణం. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వరంగల్, కరీంనగర్‌కు గ్రామస్తులు వెళ్లేలా రెండు వైపులా బస్టాప్‌లు నిర్మించాలి. రెండు వైపులా సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి కరీంనగర్‌కు వెళ్లేలా గ్రామానికి వచ్చేలా చూడాలి. సమస్య పరిష్కరించేంత వరకూ గ్రామస్తులందరం రోడ్డు పనులు జరగనివ్వం.

– చింతం శ్రీనివాస్, ఈదులగట్టెపల్లి



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే భూమిపూజ చేసినా పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మళ్లీ భూమిపూజ చేశారు. ఇప్పుడైనా పనులు ప్రారంభించాలని గ్రామానికి చెందిన సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మల్లేశం, పంచాయతీరాజ్ ఏఈ, డిపోమేనేజర్, సెల్‌నంబర్: 83097 44022

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సత్యంకు వినతి

రామడుగు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఎండీ రబీయాబేగం ఆధ్వర్యంలో కార్యకర్తలు మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందజేశారు. రూ.18 వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వసతులు కల్పించాలని విన్నవించారు. సంఘం నాయకులు పద్మ, భూలక్ష్మీ, పద్మ పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని కలిసిన ఎంఈవో

గన్నేరువరం: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మండల విద్యాధికారి రామయ్య మంగళవారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మండలంలోని పాఠశాలల సమస్యలను వివరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూర్: మానకొండూర్ బాలుర హైస్కూల్ ఆవరణలో ఈ నెల 23, 24వ తేదీల్లో ఈషా గ్రామోత్సవం పేరిట నిర్వహించే క్రీడా పోటీల పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మంగళవారం ఆవిష్కరించారు. వలంటీర్ మమత, సుశాంత్, నాగరాజు, శ్రావణ్, ఆకాశ్ ఉన్నారు.



పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

తిమ్మాపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ సూచించారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని సూచించారు. రికార్డులు పరిశీలించి, వ్యాధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంట మండల వైద్యాధికారి డాక్టర్ ప్రణవ్, సిబ్బంది ఉన్నారు.

చిగురుమామిడి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని వెంకటరమణ అనారు. చిగురుమామిడి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో సుఖప్రసవాలు చేయాలన్నారు. ఆర్ఎంపీల వద్దకు రోగులు వెళ్లకుండా వైద్యసేవలు అందించాలన్నారు. వారు రాసే హైడోస్ మందుల వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను రోగులకు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడివేయవద్దన్నారు. అనంతరం మెడికల్, సిబ్బంది రిజిస్టర్లు పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

మత్తుపదార్థాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

రామడుగు: యువత మత్తుపదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎక్సైజ్ ఏఈఎస్ నాగేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్తు పాఠశాలలో మంగళవారం కాన్సియస్నెస్ క్లబ్‌ను ఏర్పాటు చేసి మత్తు పదార్థాలు– అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. ఎక్సైజ్ రూరల్ సీఐ ఆశోక్‌కుమార్, ఎస్ఐ విజయభాస్కర్, హెచ్ఎం రమేష్, ముక్త భారత్ అభియాన్ కమిటీ ఎడ్యూకేటర్ మాలతి, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్‌యాదవ్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైదాపూర్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో కాన్షియస్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఎం రామస్వామి అధ్యక్షతన డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ఆశలు, కలలను సాకారం చేయడానికి మంచి ప్రవర్తనతో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రామస్వామి, ఉపాధ్యాయ బృందం శాంతకుమార్‌సింగ్, హనుమాండ్ల భాస్కర్, రవీందర్‌రెడ్డి, చిరంజీవి, సుజాత, హరియ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

హుజూరాబాద్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ప్రయోజనాలున్నాయని, ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖాధికారి రావుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని ధర్మరాజుపల్లి, ఇప్పలనర్సింగాపూర్ తదితర గ్రామాల పరిధిలో మంగళవారం పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. చీడపురుగుల బెడద చాలా తక్కువగా ఉండి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు, నీటి, ఎరువుల యజమాన్యం, పూత తొలగించడం అంతర పంటలు, దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు.

నవోదయ గడువు పొడిగింపు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిది, పదకొండో తరగతిలో చేరడానికి ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 26 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈ నెల 27 నుంచి 28 వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు సవరణకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎనిమిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు అవకాశముందన్నారు.



హుజూరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైస్ చైర్‌పర్సన్ స్వప్న

ఇందిరాగాంధీకి నివాళి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో మంగళవారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఇందిరాగాంధీ విగ్రహాలు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయాల్లో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం దేశ ప్రధానిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని మసీదులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

- **నిధులు విడుదల చేయాలి**

హుజూరాబాద్: దళితబంధు నిధులపై గళం విప్పితే కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం సరికాదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా ఆయనను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం మాజీ సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌లో ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలన్నారు.

- **ఏం ఒరగబెట్టారని విజయోత్సవాలు**

కరీంనగర్: అమలుకు సాధ్యంకాని కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వాటిని అమలు చేయకుండా ఏమీ ఒరగబెట్టారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం నగరంలోని బీఆర్ఎస్ నగర శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఒక్కరికైనా రూ.2,500, తులం బంగారం ఇచ్చావా అని ప్రశ్నించారు.

- **క్షయ వ్యాధి నివారణపై అవగాహన**

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో క్షయ నివారణపై వావిలాల, ఇల్లందకుంట పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన, క్షయ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యాధిపై పంచాయతీలు, స్కూళ్లు, మహిళ సంఘాల సమావేశాల్లో అవగాహన కల్పించి, నివారణకు సహకరించాలని కోరారు.

- **అడహక్ కమిటీ**

శంకరపట్నం: బీసీ ఆజాదీ యూత్ పెడరేషన్ శంకరపట్నం మండల అడహక్ కమిటీ వేసినట్లు జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు.


- **విద్యార్థులకు క్షేత్ర ప్రదర్శన**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు మంగళవారం విత్తనాలు విత్తారు. పంటల సాగువిధానంపై సైన్స్ టీచర్ సునిత పర్యవేక్షణలో పాఠశాల ఆవరణలో మడులు ఏర్పాటు చేసి విత్తనాలు చల్లారు.

- **ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి**

జమ్మికుంట: పట్టణంలోని విస్డమ్ జూనియర్ కళాశాలలో మంగళవారం శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ విజయేందర్ రెడ్డి ఝాన్సీ లక్ష్మీబాయి పోరాట తత్వాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బస్సుల కోసం ఎదురుచూపు



హుజూరాబాద్: వరంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో కరీంనగర్ నుంచి వరంగల్, హన్మకొండ రూట్లలో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కార్తీక పౌర్ణమి వేళ చాలామంది భక్తులు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ అయితే సోమవారం వెళ్లిన భక్తులు మంగళవారం వేములవాడ నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్ బస్టాండ్ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సులు లేక వరంగల్ హనుమకొండ వంటి ప్రాంతాలకు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. గంటల కొద్ది ఎదురుచూడగా వచ్చిన బస్సులో జనం కిక్కిరిసిపోయారు.

సంక్షిప్త వార్తలు

- **కేజీ టూ పీజీ విద్య అమలు చేయాలి**

సైదాపూర్: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్యను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ)జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు వంటివి అందించాలని తహసీల్దార్ మంజులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

- **నిందితుడి రిమాండ్**

చొప్పదండి: పట్టణంలోని గాలిపెల్లి కనకయ్య బట్టల దుకాణంలో పెట్రోల్ పోసి నిప్పంటించి నష్టం కలిగించిన కోడూరి శ్రీనివాస్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. కనకయ్య ఫిర్యాదుతో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

- **ఏఐదే కీలక పాత్ర**

హుజూరాబాద్: కంప్యూటర్ రంగంలో ఏఐ టెక్నాలజీదే కీలక పాత్ర అని ఎస్ఎస్ ప్లస్ ఐటీ సొల్యూషన్ కంపెనీ డైరెక్టర్ సతీష్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలవిద్యార్థులకు ఏఐ సాఫ్ట్‌వేర్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

- **పీజీలో స్పాట్ అడ్మిషన్**

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సులకు బుధవారం స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ జువాలజీ, బాటనీ కోర్సుల్లో చేరడానికి నిబంధనల ప్రకారం స్పాట్ అడ్మిషన్స్ తీసుకుంటామన్నారు.

- **టీఆర్టీఎఫ్ ఎన్నిక**

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) మండల అధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోనె కుమారస్వామిని మంగళవారం ఎన్నుకున్నారు.

- **గ్యారంటీలు అమలు చేయాలి**

చిగురుమామిడి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాల్ల నరేశ్ ఆరోపించారు. డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

- **రొటోవేటర్‌తో వరికొయ్యలు దున్నాలి**

శంకరపట్నం: రైతులు రొటోవేటర్‌తో వరికొయ్యలు దున్నుకోవాలని ఏడీఏ శ్రీధర్ సూచించారు. కేశవపట్నం రైతు వేదికలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు.

- **గడ్డి కట్టల తరలింపు**

గన్నేరువరం: మండలకేంద్రంకు చెందిన గొల్లపెల్లి అంజయ్యశ్యామల పెళ్లిరోజు సందర్భంగా ట్రాక్టర్‌లో వరి గడ్డి కట్టలను వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయ గోశాలకు మంగళవారం తరలించారు.

ముందస్తు అరెస్ట్

జమ్మికుంట: హనుమకొండలో సీఎం పర్యటన నేపథ్యంలో జమ్మికుంట పట్టణానికి చెందిన దళిత బంధు సాధన సమితి సభ్యులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు.

- **అరెస్టు సరికాదు**

వీణవంక: దళితబంధు బాధితులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు సదానందం ఆరోపించారు. మండల కేంద్రంలో మాట్లాడారు. రెండో విడత దళిత బంధు కోసం అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షకు వెనకాడమని హెచ్చరించారు.

ఇల్లందకుంట: రెండో విడత దళితబంధు డబ్బులు అడిగితే అక్రమ అరెస్ట్ చేయడం సరికాదని మున్సిపల్ మాజీ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోడేటి రామస్వామి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

- **వరల్డ్ టాయిలెట్ డే**

జమ్మికుంట: పాపక్కపల్లి గ్రామంలో ఎంపీడీవో భీమేష్ ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే నిర్వహించారు. బహిరంగా మల,మూత్ర విసర్జనతో రోగాలు ప్రబలుతాయన్నారు.

మానకొండూర్: మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

- **స్వయం పాలన దినోత్సవం**

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి, వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు టీచర్లుగా విద్యాబోధన చేశారు. టీచర్లు సరోజన, సంగీత, రమా, వేణుగోపాలస్వామి, మురళి ఉన్నారు.

- **ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ**

హుజూరాబాద్: ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ముదిరాజ్ మహాసభ నాయకులు మండల కేంద్రంలో ఆవిష్కరించారు.

గన్నేరువరం: ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను మంగళవారం గుండ్లపల్లిలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో ముదిరాజ్ జెండాను ఎగుర వేస్తూ తెలంగాణ ముదిరాజ్ దశాబ్ది ఉత్సవాల ఘనంగా నిర్వహించాలని తెలిపారు.